క్లుప్తంగా

రెగ్యులర్ చేయాలని వినతి



ఎంఈఓ చంద్రశేఖర్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

మెరకముడిదాం: తమను రెగ్యులర్ చేసేలా చూడాలని కోరుతూ మండలంలోని ఎంటీఎస్(మినిమమ్ టైమ్ స్కేల్) ఉపాధ్యాయులు ఎంఈఓ చంద్రశేఖర్‌ను కోరారు. స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విధుల్లో చేరిన తాము రెగ్యులర్ ఉపాధ్యాయులు మాదిరిగానే విధులు నిర్వర్తిస్తున్నామని చెప్పారు. తమ విధులు, సమస్యలను జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న డాక్టర్ శివాని, వైద్య సిబ్బంది

వేపాడ: బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలువురు క్షయ వ్యాధిగ్రస్తులకు వైద్యాధికారి శివాని ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జాతీయ క్షయవ్యాధి నిర్మూలన 100రోజుల కార్యక్రమంలో భాగంగా డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి, డీఎల్‌టీఓ డాక్టర్ రాణి ఆదేశాల మేరకు పౌష్టికాహారం అందజేస్తున్నామని చెప్పారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశామని తెలిపారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భవితలో ఫిజియోథెరపీ సేవలు



పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ హిమబిందు

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ హిమ బిందు గురువారం ఫిజియోథెరపీ సేవలందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయిస్తే అంగవైకల్యం తగ్గుతుందన్నారు. ప్రతీ వారం భవిత కేంద్రంలో అందించే ఫిజియోథెరపీ సేవలను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు. ఐఈఆర్‌టీలు వై.శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు



ఫ్యూజ్‌బాక్స్‌ను అమర్చుతున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

శృంగవరపుకోట: స్థానిక శ్రీనివాసకాలనీలో ఎరుకులపేట రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ బాక్స్ చేతికి అందే ఎత్తులో, డోర్లు లేకుండా ఉండడంతో సమస్యపై 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో సాక్షిలో గురువారం వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఏఈ రవి సిబ్బందిని పంపించి పాత ఫ్యూజ్ బాక్స్ స్థానంలో డోర్లు ఉన్న కొత్త ఫ్యూజ్ బాక్స్‌ను ఏర్పాటు చేయించారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

గజపతినగరం రూరల్: పంటలకు సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందని భూసార పరీక్షల కేంద్ర వ్యవసాయ సహాయ సంచాలకులు భానులత తెలిపారు. మండలంలోని కొత్తశ్రీరంగరాజపురం గ్రామంలో రైతులకు భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువుల వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. భూసార పరీక్షల కోసం వ్యవసాయ భూముల నుంచి మట్టి నమూనాలను సేకరించే పద్ధతిని వివరించారు. పచ్చిరొట్ట విత్తనాలతో పాటు, జీలుగు, కట్టె జనుము సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతుందని, పశువుల గత్తం వేయడం వల్ల పంట ఏపుగా పెరుగుతుందన్నారు. ఏఓ ధనలక్ష్మి, స్థానిక సర్పంచ్ పైడిపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు మొండిచెయ్యి..!

- జిరాయితీ భూములున్న రైతులకే భూ ఆధార్
- భూ ఆధార్– ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది
- కౌలు రైతులు, డీపట్టాదారులు, అటవీ భూములు సాగు చేసుకునే గిరిజనులకు ఫార్మర్ రిజిస్ట్రీలో దక్కని చోటు
- భూ ఆధార్ ఉన్న రైతులే వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలకు అర్హులని చెబుతున్న అధికారులు
- పథకాలు, రాయితీలకు దూరం కానున్న జిల్లాలోని వేల మంది కౌలు, గిరిజన రైతులు
- తక్షణమే భూఆధార్ నమోదును నిలిపి వేయాలని రైతు సంఘాల డిమాండ్



కొత్త శ్రీరంగరాజపురం గ్రామంలో భూఆధార్ కోసం ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో కౌలు రైతుల వివరాలు

మండలం	కౌలు రైతులు
గజపతినగరం	792
బొండపల్లి	1151
గంట్యాడ	985
దత్తిరాజేరు	508
మెంటాడ	315

బొండపల్లి: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసే వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు తదితర ప్రయోజ నాలకు ఇకపై కౌలు రైతులు, డీపట్టా భూములన్న రైతులు, అటవీ భూములు సాగుచేసుకునే గిరిజన రైతులు దూరం కానున్నారు. ఆధార్ కార్డు తరహాలోనే దేశంలో ప్రతీ రైతుకు ఒక విశిష్ట సంఖ్యతో భూఆధార్ కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.రానున్న రోజు ల్లో ఈ కార్డులున్న వారికే పీఎం కిసాన్, రైతుభరోసా పెట్టుబడి సాయం, వ్యవసాయ సంబంధ పథకాలు, రాయితీపై యాంత్రీకరణ పరికరాలు, పంటల బీమా, పంట విక్రయాలు, రుణాలపై వడ్డీ రాయితీ, సూక్ష్మసేద్యంపై రాయితీ, ఇతర ప్రోత్సాహకాలు అందించనున్నట్లు నిబంధనల్లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఇప్పటికే భూఆధార్ కార్డుల జారీకి ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల వివరాల నమోదు ప్రక్రియను రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభిం చింది. ఈనెల 25లోగా రైతులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని గడువు కూడా విధించింది. అయితే భూఆధార్ పొందేందుకు సొంతంగా జిరాయితీ భూమి ఉన్న రైతులే అర్హులని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా రు. కౌలు రైతులు, డీపట్టా భూములున్న దళిత, ఇతర రైతులు, అటవీ భూములు సాగుచేసుకుంటున్న గిరిజన రైతుల వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకునేందుకు అవకాశం ఇవ్వలేదు. గతంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి 16,242 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసింది. అలాగే జిల్లాలోని వివిధ మండలాల్లో 28,795 హెక్టార్లలో అటవీ భూమిని గిరిజను లు సాగు చేసుకుంటున్నారు. ఇనాం, దేవదాయ శాఖ భూములను సాగుచేస్తున్న రైతులూ వేల సంఖ్యలోనే ఉన్నారు. వీరంతా భూఆధార్‌కు అర్హులు కారని వ్యవసాయ అధికారులు చెబుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విజయనగరం జిల్లాలో సాగు భూముల వివరాలు

పల్లపు భూములు:	1,43,230 హెక్టార్లు
మెట్ట భూములు:	64,974 హెక్టార్లు
చెరువుల కింద సాగులో ఉన్న భూమి:	53,933 హెక్టార్లు
గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూమి:	28,795 హెక్టార్లు
జిల్లాలో కౌలు కార్డులున్న రైతులు:	16,242

పాత పద్ధతినే పాటించాలి



కౌలు రైతులు, అటవీ భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు, డీపట్టా, అసైన్డ్ భూములున్న దళిత రైతులు, ఇనాం, దేవదాయ శాఖ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు భూఆధార్ కార్డులు పొందేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. కేవలం సొంత జిరాయితీ భూములున్న వారికే కార్డులు ఇస్తే మిగతా వారి సంగతి ఏం కావాలి..?. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది కౌలు రైతులు, గిరిజన, దళిత రైతు లు పథకాలు అందక నష్టపోతారు. ఫార్మర్ రిజిస్ట్రీని తక్షణమే నిలిపి వేసి పాత పద్ధతిలోనే అన్ని వర్గాల రైతులకు పథకాలు అమలు చేయాలి.

– రాకోటి రాములు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి

కౌలు రైతులకు నష్టం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఇప్పటికే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఒక్క రూపాయి కూడా పెట్టుబడి సాయాన్ని రైతులకు అందించలేదు. భూఆధార్ కార్డులు వస్తే ఇక కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి పథకాలతో పాటు రూపాయి కూడా సాయం అందదు.

– పప్పుల వెంకటరమణ,కౌలు రైతు, బోడసింగిపేట గ్రామం, బొండపల్లి మండలం

గ్రామాల్లో వైద్య శిబిరాలు



కొత్తవలస: నిమ్మలపాలెంలో వృద్ధురాలికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సుబ్బారావు

కొత్తవలస: అప్పన్నపాలెం సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)లో భాగంగా నిమ్మలపాలెం గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యుడు తెన్నేటి సుబ్బారావు శిబిరంలో 40 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.జిందాల్ కర్మాగార ప్రతినిధులు, గోపాలకృష్ణ, వనుం సన్యాసినాయుడు మాట్లాడుతూ సీఎస్ఆర్‌లో కర్మాగారం చుట్టుపక్క గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. సర్పంచ్ కొట్యాడ నిర్మలసాయి, గ్రామపెద్దలు గొంప దుర్గా ఉమేష్, నాయుడు, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.



గజపతినగరం: బూడిపేటలో సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి

104 శిబిరం

గజపతినగరం: స్థానిక గ్రామసచివాలయం పరిధిలోని బూడిపేట,దావాలపేట గ్రామాల్లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యం లో గురువారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాల్లో 84 మందికి వైద్య పరీక్షలు చేశారు.తలనొప్పి,దగ్గు, వైరల్ జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

గుర్ల: రోజు రోజుకీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీపురుపల్లి సీఐ శంకరరావు సూచించారు. మండ లంలోని పెనుబర్తి గ్రామంలో బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల రక్షణ చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఫోన్‌లో ఎవరైనా తెలియని వ్యక్తులు బ్యాంకు ఖాతాల వివరాలు, లేదా ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. స్మార్ట్ ఫోన్‌లకు అపరిచిత వ్యక్తులు పంపించే లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. ఎస్ఐ నారాయణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సేవల్లో ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయండి

- సీజేఆర్ఎఫ్ ఛైర్మన్, జిల్లా విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ



విద్యుత్ వినియోగదారుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న సీజేఆర్ఎఫ్ ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ

కొత్తవలస: విద్యుత్ సంబంధిత సేవల్లో వినియోగదారులకు ఏమైనా సమస్యలు ఎదురైనా, సిబ్బంది పనితీరువల్ల అసౌకర్యం కలిగినా రాతపూర్వకంగా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్)లో ఫిర్యాదు చేయాలని సీజీఆర్ఎఫ్ ఛైర్మన్, జిల్లా విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం క్యాంపు కోర్టు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు లోఓల్టేజ్, విద్యుత్ స్తంభాల మా ర్పు, కొత్త కనెక్షన్‌ల ఏర్పాటులో జాప్యం, వ్యవసాయ మోటార్లకు కనెక్షన్‌లు ఇవ్వడంలో సిబ్బంది అలసత్వం, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయకపోవడం, విద్యుత్ బిల్లులు అధికంగా రావడం వంటి సమస్యలపై 27మంది ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుల పై 60 రోజుల్లోగా పూర్తిస్థాయి విచారణ జరిపి తీర్పులను వెలువరిస్తామని విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ తెలిపారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజాకోర్టును ఆశ్రయించి న్యాయం పొందాలని సూచించారు.ప్రజాకోర్టుకు హాజరు కాలేకపోయిన వారు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం,ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విశాఖపట్నం చిరునామాకి రిజిస్టర్ పోస్టు చేయాలని సూచించారు. అలా వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లోనే విచారించి తీర్పు కాపీలను వినియోగదారులకు రిజిస్టర్ పోస్టులో పంపిస్తామని చెప్పారు. గతేడాది నుంచి సీజీఆర్ఎఫ్‌లో 8,474 కేసులు నమోదు కాగా 8,384 తీర్పులు వెల్లడించామని 90 కేసులు పెండిగ్‌లో ఉన్నట్లు తెలిపారు. క్యాంపు కోర్టు సభ్యులు ఎస్.కె.బాబర్, సురేఖ రాణి, ఎస్.మురళీకృష్ణ, విద్యుత్‌శాఖ ఈఈ మురళీకృష్ణ, డీఈ బి.వెంకటరావు, ఏఈ ఇమంది అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో క్షయ నివారణ



ప్రతిజ్ఞ చేస్తున్న సీనియర్ టీబీ సూపర్ వైజర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది

గంట్యాడ: క్షయ(టీబీ)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి లక్షణాలను త్వరగా గుర్తించి మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని సీనియర్ టీబీ సూపర్ వైజర్ శ్రీనివాస్ చెప్పారు. మండలంలో ని బోనంగి విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధిని త్వరగా గుర్తించడం ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందకుండా నియంత్రించవచ్చన్నారు. అనంతరం వైద్య సిబ్బంది, స్థానికులతో కలిసి క్షయ నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆరోగ్య సహాయకులుఈశ్వరావు, ఎంఎల్‌పీ హరీష్, ఏఎన్ఎం జానకి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం

చీపురుపల్లి/శృంగవరపుకోట: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లో అనుబంధ విభాగాల కు నియమితులైన అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి.

ఎస్.కోట నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల వివరాలు

విభాగం	అధ్యక్షుడు/అధ్యక్షురాలు
యువజన	వాకాడ సతీష్
మహిళల	మమ్ములూరి వెంకటలక్ష్మి
రైతు	గేదెల నరసింహానాయుడు
బీసీ సెల్	మురిపిండి గంగరాజు
ఎస్సీ సెల్	బోని కుమారి
ఎస్టీ సెల్	కేత వీరన్న
మైనార్టీ సెల్	షేక్ రెహ్మాన్
క్రిస్టియన్‌మైనార్టీ సెల్	గోకేడ సత్యంనాయుడు
స్టూడెంట్	దివదారి శేఖర్
పంచాయతీరాజ్	కూనిరెడ్డి వెంకటరావు
ఆర్‌టీఐ	అప్పాన సుబ్రహ్మణ్యం
వలంటీర్స్	జె.డి.కె.అప్పలరాజు
గ్రీవెన్స్‌సెల్	కండిపల్లి పెదనాయుడు
వాణిజ్యం	కొట్యాడ శ్రీనివాసరావు
వీవర్స్ వింగ్	స్వర్ణపూడి వెంకటరమణ
టీయూసీ	కోన దేముడు
అంగన్‌వాడీ	బొడ్డి చాముండేశ్వరి
లీగల్‌సెల్	కల్లంపూడి మహేష్
కల్చరల్	బీల సతీష్
సోషల్‌మీడియా	యడ్ల కిషోర్‌కుమార్
ఐటీ	గొర్లె శ్రీనివాసరావు
దివ్యాంగులు	దువ్వ అప్పలరాము
డాక్టర్స్	పూడి శ్రీనివాసరావు
పబ్లిసిటీ వింగ్	కొట్యాడ మహేష్
బూత్ కమిటీ	బోదల సురేష్
ఇంటలెక్చువల్	తూర్పాటి శివాజీ

చీపురుపల్లి నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల వివరాలు

విభాగం	అధ్యక్షుడు/అధ్యక్షురాలు
యువజన	బెల్లాన వంశీకృష్ణ
మహిళల	గేదెల కృష్ణవేణి
రైతు	అధికారులు శ్రీనివాసరావు
బీసీ సెల్	జమ్ము స్వామినాయుడు
ఎస్సీ సెల్	మంగళగిరి సుధారాణి
స్టూడెంట్	బమ్మిడి కార్తీక్
పంచాయతీరాజ్	తాడ్డి వేణుగోపాలరావు
ఆర్‌టీఐ	గొర్లె నర్సింహమూర్తి
వలంటీర్లు	బెల్లాన త్రినాథరావు
గ్రీవెన్స్ సెల్	గుడివాడ తమ్మినాయుడు
వాణిజ్యం	ఎస్.వి.జి.శ్రీనివాసరావు
వీవర్స్ వింగ్	బొమ్మన రమణ
టియూసీ	కంది రామారావు
అంగన్‌వాడీ	తోట స్వాతి
లీగల్ సెల్	పప్పల కృష్ణమూర్తి
సాంస్కృతిక	ఇప్పిలి సూర్యప్రకాష్(గోవింద్)
సోషల్ మీడియా	కె.ఎస్.ఆర్.ప్రసాద్(రాము)
ఐటీ	సత్తారు శ్రీనివాసరావు
దివ్యాంగులు	అట్టాడ రామకృష్ణ
పబ్లిసిటీ వింగ్	తోట తిరుపతిరావు
బూత్ కమిటీ	పొన్నాడ కుమార్
ఇంటలెక్చువల్	ఎం.వి.ఎస్.ఎన్.రాజు

పోలింగ్, జాతర ఏర్పాట్లపై సమీక్ష



పుణ్యగిరిలో ఉమాకోటిలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఎస్‌డీపీఓ నారాయణమూర్తి

శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, పుణ్యగిరి కొండపై శివరాత్రి జాతర ఒకేరోజు కావడంతో అటు భక్తులకు, ఇటు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎస్‌డీపీఓ ఎం.శ్రీనివాసరావు స్థానిక పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఎస్.కోట పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకటరమణమూర్తి, పోలీసులతో పోలింగ్, జాతర ఏర్పాట్లపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఎలక్షన్ వల్ల, భక్తులకు ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి పుణ్యగిరి కొండపై ఉన్న ఉమాకోటి లింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. ఆలయ పూజారి ఎస్‌డీపీఓకు స్వాగ తం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లు పరిశీలించి ఎస్ఐలు గంగరాజు, చంద్రశేఖర్‌కు పలు సూచనలు చేశా రు. ఆయన వెంట వేచలపు వెంకట నారాయణమూర్తి, తదితరులున్నారు.

ఘనంగా బంగారమ్మ తీర్థం



తీర్థంలో కోలాటం ఆడుతున్న మహిళలు

వేపాడ: మండలంలో కొండగంగుబూడిలో గ్రామదేవత బంగారమ్మ తీర్థం గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది.



వాలీబాల్ పోటీలను తిలకిస్తున్న గ్రామస్తులు

వాలీబాల్ పోటీలు

తీర్థం సందర్భంగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎస్.కోట నియోజకవ ర్గం నుంచి 20 జట్లు పాల్గొనగా జామి జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.10 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన గుల్లేపల్లి జట్టుకు రూ.7వేల నగదు బహు మతిని గ్రామపెద్దలు అందజేశారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎల్ఐసీ మూడు, నాలుగు తరగతుల ఉద్యోగులు

శృంగవరపుకోట: స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద మూడు, నాలుగు తరగతుల ఉద్యోగ సంఘం సంఘం ప్రెసిడెంట్ టి.జగన్నాథం, సెక్రటరీ కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు వాకౌట్ స్ట్రైక్ పేరిట గురువారం ఆందోళన చేశారు. ఎల్ఐసీలో మూడు, నాలుగు తరగతుల ఉద్యోగుల నియామకం చేపట్టాలని, ఉద్యోగ సంఘానికి ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్‌గా గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐ పెంపు బిల్లును ఉపసంహరించుకోవాలని, ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ తొలగించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులతో పాటు, పట్టాదారులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం: మండలంలోని చల్లపేట ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ బొబ్బిలి డివిజన్ కార్య నిర్వాహక ఇంజినీర్ ఏ.అనంతరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సాలిపేట,మర్రివలస, చిట్టాయవలస,మెంటాడ మండలంలోని వెంకంపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చీపురుపల్లి మండలంలో..

చీపురుపల్లిరూరల్: మండలంలోని గచ్చలవలస సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ త్రినాథరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో కొత్తగా నిమ్మలవలస 11 కేవీ ఫీడర్ బ్రేకర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గచ్చలవలస, మెట్టపల్లి, బెవరపేట, బొబ్బాదిపేట, పత్తికాయవలస, నిమ్మలవలస, దేవరపొదిలాం, చొక్కరపాలెం, గుణిదాం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

దివ్యాంగులకు సేవచేయడంలోనే నిజమైన సంతృప్తి

- సౌత్ ఏసియా ఎల్‌పీజీ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ నవీన్‌ముఖేజా
- గురుదేవా చారిటబుల్ ట్రస్టుకు అంబులెన్స్ వితరణ
- పలువురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేస్తున్న సౌత్ ఏసియా ఎల్‌పీజీ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ నవీన్‌ముఖేజా, తదితరులు



ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబుకు అంబులెన్స్ తాళం అందజేస్తున్న నవీన్‌ముఖేజా

కొత్తవలస: నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి, దివ్యాంగులకు సేవ చేసినప్పుడే నిజమైన ఆత్మసంతృప్తి కలుగుతుందని సౌత్ ఏసియా ఎల్‌పీజీ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ ఖేజా అన్నారు. మండలంలోని గురుదేవా చారిటిబుల్ ట్రస్టును కంపెనీ ప్రతినిధులతో కలిసి గురువారం సందర్శించారు. ముందుగా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలు, ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం వివరాలను ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు వివరించారు. అనంతరం వంద మందికి దివ్యాంగులకు వివిధ రకాల కృత్రిమ అవయవాలు, ఉపకరణాలను పంపిణీ చేశారు. ట్రస్టుకు అత్యాధునిక లైఫ్ సపోర్టు అంబులెన్సును అందజేశారు. నవీన్‌ముఖేజా మాట్లాడుతూ గురుదేవా చారిటిబుల్ ట్రస్టు దివ్యాంగులకు అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమైనవని, ప్రతి ఒక్కరు సమాజానికి తనవంతు సహాయం అందించాలన్నారు. కంపెనీ సీఎస్ఆర్ నిధులను ట్రస్టు సేవలకు కేటాయిస్తామన్నారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తన జీవితాన్ని దివ్యాంగుల సేవకే అంకితం చేయడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో కంపెనీ సీఎఫ్ఓ వికాస్‌వర్మ, సీఎస్ఆర్ హెడ్ రామనాథ్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

చీపురుపల్లి/మెరకముడిదాం/గుర్ల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. చీపురుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, మెరకముడిదాం మండలంలోని భైరీపురం, గర్భాం ఉన్నత పాఠశాలలు, గర్భాం మోడల్ స్కూల్, గుర్ల మండలంలోని గుజ్జింగివలస, పాలవలస హైస్కూల్‌లో ఫ్యాప్టో పూర్వపు ఛైర్మన్,ఏపీ యూటీఎఫ్ రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రచారం చేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి ముదునూరు రఘునాథరాజు,రాష్ట్ర కౌన్సిలర్ ఆలమూరు సత్యశ్రీనివాస్, మజ్జి హరికృష్ణ, పట్నాయకుని శ్రీనివాస్,అండలూరి సత్యానంద్ పాల్గొన్నారు.



గర్భాం మోడల్ స్కూల్‌లో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు